న్యూ ఇయర్ జోష్

పులివెందుల టౌన్ : నూతన సంవత్సరం అంటేనే ప్రజల్లో, యువకుల్లో నూతనోత్సాహం పరవళ్లు తొక్కుతుంది. నవశకానికి ఆహ్వానం పలుకుతూ యువత కేరింతలతో ఎంతో ఉత్సాహంగా 2024 ఏడాదికి స్వస్తి పలుకుతూ.. నూతన సంవత్సరం 2025కు ఆహ్వానం పలికారు. రైతన్నలు 2025 పాడిపంటలతో బాగా అచ్చిరావాలని కోరుకుంటే.. యువత భవిష్యత్ బ్రహ్మాండంగా సాగాలని కోరుకుంటున్నారు. మంగళవారంతో పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ బుధవారం కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టి నవ భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ప్రజలు ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. మంగళవారం ప్రజలతో పూలంగళ్ల ప్రాంతమంతా కిటకిటలాడింది.

బేకరీలు, వస్త్ర, హోటళ్ల వద్ద జనాల సందడి :

నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజలు షాపింగ్‌లతో బిజీబిజీగా గడిపారు. వైన్ షాపులతోపాటు బేకరీలు, వస్త్ర దుకాణాలు, హోటళ్ల వద్ద జనాలు బారులు తీరారు. కొత్త దుస్తుల కొనుగోలు కోసం షాపుల వద్ద.. బిర్యాని ప్యాకెట్ల కోసం హోటళ్ల వద్ద.. స్వీట్లు, కేక్‌ల కోసం బేకరీల వద్ద జనాల రద్దీ కనిపించింది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని బేకరీలలో వివిధ రకాల కేక్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. ఎక్కడా చూసినా షాపులను విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించారు.

పూల ధరలు పైపైకి :

కొత్త సంవత్సరానికి పూలంగళ్ల వద్ద పూల ధరలు పైపైకి పెరిగి మూర పూలు రూ.50 నుండి అమ్మారు. కేజీ బంతి పూలు కిలో రూ.300లకు పైగా అమ్మసాగారు. గులాబి, చామంతి పూల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. రంగు పాడులు కూడా ధరహాసం చేస్తున్నాయి.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

పట్టణంలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నూరు బాషా సంఘ అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముందస్తు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, మాజీ డైరెక్టర్ హాలు గంగాధర్ రెడ్డి, సాంబశివా రెడ్డి, సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, జేసీఎస్‌లు ఇంచార్జిలు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్, కృష్ణమూర్తి, నాగరాజు, అంబకపల్లె నారాయణస్వామి, విశ్వనాథరెడ్డి, పద్మనాభ రెడ్డి, పోస్టల్ బాలయ్య, చలపతి, వెంకటపతి, వెంకట సుబ్బయ్య, తదితర వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పులివెందులలో పూలంగళ్ల వద్ద కొనుగోలు చేస్తున్న జనం



నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

లింగాలలో..

లింగాల : మండలంలో నూతన సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు యువకులు, పిల్లలు ఏర్పాట్లు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కేకులు బాణా సంచా పేల్చుతూ 2025 ఆంగ్ల సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు రాత్రి 12 గంటల వరకు మేల్కొని ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సంబరాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయాల్లో ప్రార్థనలు నిర్వహించారు. 2025 సంవత్సరంలో సమస్త మానవాళికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

నూతన సంవత్సర వేడుకలకు ఆంక్షలు

సింహాద్రిపురం : నూతన సంవత్సర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆంక్షలు విధించామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా అర్థరాత్రి సమయంలో బహిరంగ ప్రదేశాలలో వేడుకలు నిషేధించామని, మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘ అధ్యక్షుడు గురుప్రసాద్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘ అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆవిష్కరించారు. ఆయనతోపాటు అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, శ్రీరంగనాథ ఆలయ మాజీ చైర్మన్ యార్వ వెంకటసుబ్బయ్యలతోపాటు బలిజ సంఘ పెద్దలు క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్లను రూపొందించి అందులో సంఘీయులకు సంబంధించిన వివరాలను పొందుపరచడం, పంచాంగ రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి సంఘ అధ్యక్షుడు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ సోపాల వీరా, ప్రధాన కార్యదర్శి రాచనేని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు నిధులు మంజూరు

తొండూరు : మండలంలోని డ్వాక్రా సంఘాలకు రూ.1.30 కోట్లు మంజూరైనట్లు ఏపీఎం వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక మహిళా శక్తి భవన్‌లో పులివెందుల ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలోని డ్వాక్రా సంఘాలకు సంబంధించి రూ.1.30 కోట్ల శాంక్షన్ లెటర్లను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీసీలు, మండల సమాఖ్య కార్యదర్శి వసంతకుమారి, గ్రామ సంఘ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించవద్దు



ఆర్టీపీపీలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎర్రగుంట్ల : చండీఘడ్, ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్, దక్షిణాంచల్ ప్రాంతాల విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించడానికి జరుగుతున్న ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఆర్టీపీపీ పవర్ హౌస్ గేటు ఎదుట ఏపీ విద్యుత్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కమలాపురం : రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవరాజుపల్లె, ఎర్రగుడిపాడు గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ ద్రావణాలు, కషాయాలు, వాటి తయారీని వివరించారు. చీడపీడల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నస్త్రం, తూటికాడ కషాయం వంటివి వాడటం వలన రసం పీల్చే పురుగులు, కాయ కొమ్మ తొలిచే పురుగులు, కత్తెర పురుగుల నివారణకు దోహద పడతాయన్నారు. పేడ మూత్రం, ఇంగువ ద్రావణం, సొంటి పాల కషాయం వంటి ద్రావణాలు వాడటం వలన అగ్గి తెగులు, ఆకు మచ్చ తెగులును నివారించవచ్చన్నారు. శనగ పంట పూత, పిందె దశలో 13:0:45 ఉపయోగించడం వలన మంచి దిగుబడి రావడానికి దోహదపడుతుందని తెలియజేశారు. క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకున్న ప్రతి రైతు ఇ పంట నమోదు తప్పని సరిగా చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీపీఏ, రైతులు పాల్గొన్నారు.



బుడ్డ శనగ పంటను పరిశీలిస్తున్న కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె : ప్రతి రైతు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం కీర్తిపల్లె, పాయసంపల్లెల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం బుడ్డ శనగ పంట పూత, పిందె దశలో ఉందని ఈ దశలో 13.0.45 ఎరువులను పురుగు మందులతో పాటు కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. పంటలో జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వాడడం వలన రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు, శనగ పచ్చ పురుగులను నివారించేందుకు వీలుంటుందని తెలిపారు. అనంతరం పాయసంపల్లె రైతు సహాయ కేంద్రంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. భూసార పరిక్షలు చేయించడం వలన వాటి ఫలితాలను బట్టి అవసరమైన ఎరువులు వాడవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సహాయకులు ఇంతియాజ్, కీర్తిపల్లె, పాయసంపల్లె గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు కూల్చివేత



కూల్చివేసిన స్థలంలో శిథిలాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె గ్రామానికి చెందిన బి.లక్ష్మీదేవికి చెందిన రేకుల షెడ్డును బావి స్థల పరిధిలో వున్నదని మండల రెవెన్యూ అధికారులు మంగళవారం పోలీసు బందోబస్తుతో కూల్చివేశారు. ఈ సందర్భంగా బాధితురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ సంబంధిత స్థలం తన తాత 1989వ సంవత్సరంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెంబర్ 2578 ద్వారా కొనుగోలు చేసుకున్నామని, మరి కొంత స్థలాన్ని గతంలో 1998వ సంవత్సరంలో అప్పటి మండల రెవెన్యూ అధికారి అయిదు సెంట్లకు నివేశ స్థలం పట్టా మంజూరు చేశారని తొలగించవద్దని అడ్డగించారు. దీంతో పోలీసులు లక్ష్మీదేవిని, ఆమె భర్త సుబ్బారెడ్డిని, తమ్ముడు లక్ష్మిరెడ్డిని పోలీసుస్టేషన్ తరలించారు. ఈ విషయమై తహసీల్దారును వివరణ కోరగా బుగ్గలేటిపల్లె ఎల్‌పీఎం 94 విస్తీర్ణం 51 సెంట్లు బావి పోరంబోకుగా నమోదై వున్నదని, నోటీసులు గతంలోనే ఇచ్చామని, ఖాళీ చేయనందున ఎంక్రోచ్మెంట్ యాక్ట్ మేరకు కట్టడాలను తొలగించినట్లు తెలిపారు. బావి పేరిట ఉన్న స్థలంలో ఎందరో ఉన్నారని ఒక్క లక్ష్మీదేవికి చెందిన వాటిని మాత్రమే కూల్చడం వెనుక ఒత్తిడులే కారణంగా తెలుస్తోంది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : జనవరి 5న పట్టణంలోని అహోబిలాపురం పాఠశాలలో నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన తెలుపుతూ 2వేల ఉద్యోగాలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో వివిధ ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయని, పులివెందుల ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులు 5వ తరగతి నుండి బీటెక్, ఎంటెక్ చదివిన వారు ప్రతి ఒక్కరూ ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునన్నారు.

మహా సభను జయప్రదం చేయండి

పెండ్లిమర్రి : కడప నగరంలో ఈనెల 4, 5వ తేదీన నిర్వహించే సీపీఎం జిల్లా మహా సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ మంగళవారం మహా సభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కడప నగరంలోని జియోన్ కాలేజి నుంచి ర్యాలీ ప్రదర్శన అనంతరం ఐటీఐ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కడప జిల్లా అభివృద్ధి మీద నిర్లక్ష్యంగా ఉన్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ పరిధిలో ఆలయం అభివృద్ధి

ఎర్రగుంట్ల : కలమల్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తకలమల్ల గ్రామంలో వెలసిన శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయం దేవదాయశాఖ పరిధిలో అభివృద్ధి జరుగుతోందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆలయంకు 1943 నుంచి కమిటీ ఏర్పాటైందన్నారు. అప్పుడు మొదటగా వెంకటసుబ్బయ్య, చిన్నపురెడ్డిలు చైర్మన్‌లుగా ఆలయంను అభివృద్ధి చేశారన్నారు. 1957 నుంచి ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి వచ్చిందన్నారు. ఈ ఆలయం పరిధిలో సుమారు 61 ఎకరాలు దేవదాయ భూమి ఉందన్నారు. ఈ భూమికి ప్రతి ఏడాది వేలం పాట నిర్వహించి ఆ వచ్చిన మొత్తాన్ని దేవాలయ పూజలకు ఖర్చు చేస్తున్నారన్నారు. కొందరు అసత్య ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం

తొండూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం 62వ వార్షికోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఉదయం పాఠశాల వ్యవస్థాపకుడు మఠం గంగిరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదికను దాత, విశ్రాంత హెడ్మాస్టర్ వెంకట్రామిరెడ్డి ప్రారంభించారు.

రైతు నాగేంద్ర చేసిన అప్పులను ప్రభుత్వం తీర్చాలి

సింహాద్రిపురం : చేసిన అప్పులు తీర్చలేక రైతు నాగేంద్ర కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ అప్పులను ప్రభుత్వం తీర్చి రైతు నాగేంద్ర తల్లి సిద్ధమ్మకు ఆర్థిక సాయం చేయాలని రైతు, కౌలు రైతు రాష్ట్ర సంఘం నాయకులు రాజారాంరెడ్డి, బాలరంగయ్యలు కోరారు. మంగళవారం వారు దిద్దేకుంట్ల గ్రామానికి వెళ్లి నాగేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల నుండి నాగేంద్ర కుటుంబం మొదట పొట్టేళ్ల పెంపకం, తరువాత ఆరు ఎనుములతో పాడి పరిశ్రమ చేస్తుండగా దొంగలు ఐదు ఎనుములు ఎత్తుకు వెళ్లారన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక అధిక అప్పులకు గురయ్యాడన్నారు. అలాగే 10 ఎకరాల కౌలు భూములకు ముందస్తు కౌలు చెల్లించి పంటలను సాగు చేశారన్నారు. సాగు చేసిన పంటలలో దిగుబడి రాక అప్పుల భారం పెరిగిందన్నారు. ఫైనాన్స్‌లో ట్రాక్టర్ తీసుకున్నాడు. కంతులు చెల్లించలేక ట్రాక్టర్‌ను, ఉన్న ఒకటిన్నర పొలాన్ని కుదువ పెట్టాడు. అప్పులు తీర్చే మార్గంలేక ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కమిటీ సభ్యులు జయ శేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆదిరెడ్డి, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు



నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2025వ సంవత్సరం నియోజకవర్గ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలన్నారు. ప్రజలు, కర్షకులు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులందరికి 2025లో అన్ని శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఐదేళ్ల పాటు సుపరిపాలన అందించి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ఒక్క మన జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి జగనన్న సీఎం కావడం తథ్యమన్నారు. 2025 నూతన సంవత్సర వేడుకలు ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జరుపుకోవాలని ఆయన అన్నారు.

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

కమలాపురం : మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. ముఖ్యంగా మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు కాగానే యువకులు బాణా సంచా పేల్చి నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. మోటార్ బైకుల్లో పుర వీధుల్లో తిరుగుతూ స్నేహితులకు, సన్నిహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎటు చూసిన నూతన సంవత్సర సందడే కనిపించింది. ప్రతి గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలందరికి అన్ని శుభాలు కలగాలని పలువురు పూజలు, పురస్కారాలు చేశారు. కాగా మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సీఐ ఎస్‌కే రోషన్ పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు అత్యున్నత స్థాయికి చేరుకోవాలి


పాఠశాల విద్యార్థినికి స్కాలర్ షిప్‌ను అందిస్తున్న ఏపీజీబీ అధికారులు

తొండూరు : విద్యార్థులు ఇలాంటి స్కాలర్ షిప్‌లను సద్వినియోగం చేసుకుని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ నరసింహులు తెలిపారు. మంగళవారం మండలంలోని అగడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు మెరిట్ స్కాలర్ షిప్ కింద రూ.5వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఏపీజీబీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులు చేయలేము


సమావేశంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని అడుగుతున్న వైస్ చైర్మన్ సింగరయ్య

జమ్మలమడుగు : గడప గడపకు కింద చేసిన పనులకు ఇప్పట్లో బిల్లులు రావని వాటిని ప్రభుత్వం పక్కన పెట్టిందని వచ్చినప్పుడు మాత్రమే తీసుకోవాల్సిందే తప్ప మున్సిపాలిటీ నిధులను చెల్లించే పరిస్థితి లేదని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 15వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య మాట్లాడుతూ తాము గత ప్రభుత్వంలో పనులు చేశామని బిల్లులను మంజూరు చేయాలన్నారు. కౌన్సిలర్లకు రావలసిన గౌరవ వేతనం ఇంత వరకు రాలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు చెప్పిన దాని ప్రకారం చాలా మంది గడప గడపకు కార్యాక్రమంలో భాగంగా పనులు చేశారు. ఈ పనులకు బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సిందే తప్ప మున్సిపాలిటీ నుంచి చెల్లించే పరిస్థితులు లేవన్నారు. ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లా జానీ మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిపనులకు తాము వ్యతిరేకం కాదని అయితే వేసిన రోడ్డుపైనే రోడ్డు వేయడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతాయన్నారు. మోరగుడి మూడు రోడ్ల వద్ద నుంచి నారాపుర స్వామి రహదారిలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇలా వేయడం సరైంది కాదన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

వేంపల్లె : విద్యార్థులు కష్టపడి చదువుతేనే మంచి భవిష్యత్తు ఉంటుందని వైస్ ఎంపీపీ బాబా షరీఫ్, ఎంపీటీసీ రహమతుల్లాఖాన్‌లు తెలిపారు. మంగళవారం వేంపల్లెలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ ఎస్ఎస్‌సీ టెస్ట్ పేపర్స్–2025 బుక్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్స్‌ను ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను గొప్ప ప్రయోజకులుగా చేయాలని కోరారు. ప్రతి ఏడాది విద్యార్థులకు టెస్ట్ పేపర్స్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు వీల్ చైర్స్ పంపిణీ


దివ్యాంగ చిన్నారులకు వీల్ చైర్స్‌ను అందజేస్తున్న ఎంఈఓ

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగ చిన్నారులకు ఎంఈఓ జాఫర్ సాదిక్, కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి అధ్యక్షుడు షేక్ నజీమ్ అహ్మద్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా చేతుల మీదుగా వీల్ చైర్స్‌ను అందజేసి మాట్లాడారు. భవిత కేంద్రంలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణములన్ని దాతల సహకారంతో సమకూర్చుతుందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఎప్పటికప్పుడు అలవెన్సెస్ అందజేస్తున్నామన్నారు. భవిత సెంటర్‌లో పనిచేస్తున్న కేర్ టేకర్ సుజాత భర్త మృతి చెందడంతో దాతల సహకారంతో రూ.56,750 సేకరించి అందజేశారు. అనంతరం హెడ్మాస్టర్ చిన్నారులకు ఐడి కార్డులను అందించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చు


ఈశ్వరి దంపతులను సత్కరిస్తున్న ఏఓ రవికుమార్

వేంపల్లె : ధ్యానం చేయడం వలన మానసిక ఒత్తిడులు, ఆందోళనలను అధిగమించవచ్చునని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా తెలిపారు. మంగళవారం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో ఇటీవల జరిగిన మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని కొనసాగింపుగా ధ్యాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి, ధ్యానం యొక్క ప్రాముఖ్యతను ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్దేశిస్తూ విద్యార్థులచే కొంత సమయం ధ్యానం చేయించారు. అనంతరం ఈశ్వరి దంపతులు మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకోవడంపట్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం నూతన సంవత్సరాన్ని ధ్యానంతో ఆహ్వానించారు. ఈశ్వరీ దంపతులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు దీప్తి, యోగ అధ్యాపకురాలు లక్ష్మీభారతి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌బీఐ భవనం ప్రారంభం


నూతన ఎస్‌బీఐ భవనంను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ జీఎం

ఎర్రగుంట్ల : పొదుపు సంఘాలలో ఉన్న మహిళల శక్తి ఆర్థిక అభివృద్ధి కోసం రుణాలు ఇవ్వడంలో ఎస్‌బీఐ ముందడుగులో ఉందని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కడప రోడ్డులో నూతన ఎస్‌బీఐ భవనంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో స్వయం సిద్ధ నారీశక్తి పథకం కింద సుమారు 40 రుణాలు ఇచ్చామన్నారు. ఈ నెలలోనే రూ.3.40 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామరావు, డిప్యూటీ జీఎం దినేష్‌గులాటి, ఆర్ఎం శ్రీవాణికిశోర్ కుమార్, ఎస్‌బీఐ అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో 2025వ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీ చైతన్య పాఠశాల ఆవరణంలో ముందస్తు నూతన సంవత్సర సంబరాలను విద్యార్థులు చేపట్టారు. 2024లో జరిగిన సంఘటనలను విద్యార్థులకు అ పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు. 2025లో కూడా సంతోషంగా ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలు వేయడంతో పాటు సృజనాత్మక వేషధారణలు వేశారు.